

వైద్యులకు రక్షణ కల్పించాలి

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన దేశాన్ని కలచివేసింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలి. రోగుల ప్రాణాలు కాపాడే డాక్టర్లు, వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి. మహిళా వైద్యులు రాత్రి సమయాల్లో విధులు నిర్వహించాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. మహిళలు, డాక్టర్ల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలి.

– డాక్టర్ ఏవీకే చైతన్య, పీహెచ్‌సీ వైద్యుడు, సీతానగరం



వైద్యులపై దాడులు హేయమైన చర్య

ఇటీవల కాలంలో వైద్యులపై దాడులు పెరిగిపోయాయి. ఇది చాలా హేయమైన చర్య. ఎన్నో కష్టాలకు ఓర్చి వైద్య వృత్తిలోకి వచ్చాం. ఆసుపత్రిలో నిత్యం మాకు పరీక్షే. డాక్టర్లకు భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఒక కోల్‌కతా ఘటనే కాదు నిత్యం ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయి. ఇవి పునరావృతం కాకుండా చూడాలి. ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలుచేయాలి.



– డాక్టర్ సలాది సాయికుమార్, ఎండీ, సూర్యచంద్ర హోమియో

క్లుప్తంగా

సాయిబాబాకు ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని ఆంధ్రా శిరిడీ సాయిబాబా వారికి గురువారం ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రావణ మాసం ఏకాదశి పురస్కరించి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు ,అభిషేకాలు, భజనలు, హారతులు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై దృష్టి సారించాలి

బిక్కవోలు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని హెచ్‌ఎం చిర్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పందలపాక పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ గొల్లల మామిడాడ శ్రీసూర్య సభ్యుల సహకారంతో వివిధ క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. హాకీ మాంత్రికుడు ధ్యానచంద్, తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రంగంపేట: సీజనల్ వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని సుభద్రంపేట గ్రామంలో గురువారం సీజనల్ వ్యాధులపై ఫీవర్ సర్వే చేశారు. అనంతరం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు అందించారు. అవసరమైన వారిని పీహెచ్‌సీకి తరలించి టెస్టులు చేయిస్తామని తెలిపారు.

ఎస్‌ఐ కృష్ణసాయికి సత్కారం



ఎస్‌ఐ కృష్ణసాయిని సత్కరిస్తున్న సర్పంచులు, ఎంపీటీసీలు

రంగంపేట: స్థానిక ఎస్‌ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తోట కృష్ణసాయిని గురువారం మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కృష్ణసాయిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రంగంపేట: సారా తయారీ, విక్రయాలు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తోట కృష్ణసాయి తెలిపారు. మండలంలోని జి.దొంతమూరులో గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బాలవరం గ్రామానికి చెందిన ఈలి సురేష్‌ను అరెస్టు చేసి అతని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టుకు తరలించగా రిమాండు విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బిల్డింగ్‌పై నుంచి పడి యువకుడి మృతి

బిక్కవోలు: స్థానిక గ్రామంలోని రైస్‌మిల్లు వద్ద కాట్రేనికొన మండలం పల్లంకుర్రు గ్రామానికి చెందిన మోకా శ్రీనివాస్ (28) మృతి చెందినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ గురువారం తెలిపారు. మృతుడు రైస్ మిల్లులో పనిచేయడానికి వచ్చాడు. టెర్రస్ మీద వెల్డింగ్ పనిచేస్తూ ప్రమాదవశాత్తూ పడిపోయినట్లు తెలిపారు. మృతదేహాన్ని అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

యువ క్రీడాకారుల ప్రతిభ అభినందనీయం

రాజమహేంద్రవరం రూరల్: క్రీడల్లో ప్రతిభ చూపి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన యువ క్రీడాకారులు అభినందనీయులని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆమె జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులను సన్మానించారు. జాతీయస్థాయిలో తైక్వాండో, టేబుల్ టెన్నిస్, బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటిన గుబ్బల మేరీ, నల్ల ప్రజ్ఞ, గౌతమ్, వెంకట చైతన్య, రుద్రకుమార్, కె.దివ్యశ్రీ, ఎం.ప్రవీణ్‌కుమార్, వీవీ కిరణ్మయి, జి.అక్షిత, వి.సాత్వికలను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణ నాయక్, జిల్లా క్రీడాధికారి డీవీవీ శేషగిరి, కోచ్‌లు ఎస్‌ఎం దాస్, బీవీజి.నాగేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి హితులు.. మట్టి గణపతులు

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పర్యావరణానికి హాని
- రసాయన రంగులతో వ్యాధులు సోకే ప్రమాదం



విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలు



కొంకుదురులో విద్యార్థులు చేసిన మట్టి గణపతి విగ్రహాలు

బిక్కవోలు: వినాయక చవితి వచ్చేస్తోంది. యువత ఎంతో ఉత్సాహంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో మట్టి ప్రతిమలనే పూజించాలని పర్యావరణ వేత్తలు ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లో ఈ ఏడాది అత్యధిక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో..

వచ్చే నెల ఏడున వినాయక చవితి సందర్భంగా అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లోని 58 గ్రామాల్లో సుమారు 300 పైగా వినాయక పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇవిగాక ప్రతి ఇంటా వినాయక ప్రతిమలతో పూజలు చేస్తారు. ఎక్కువగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలను వినియోగించడానికే మొగ్గు చూపుతున్నారు, ఇదే పర్యావరణానికి పెద్ద సమస్యగా మారుతోంది. ఉత్సవ నిర్వాహకులు మట్టి ప్రతిమలనే ఏర్పాటు చేసుకుని ఉత్సవాలను నిర్వహించుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు.

మట్టితో లాభాలు

సహజ సిద్ధంగా లభించే బంక మట్టితో విగ్రహాలు తయారు చేసుకోవడం శ్రేయస్కరం. ఇవి నీటితో సులభంగా కరిగిపోతాయి. వీటి నిమజ్జనంతో నీటి వనరులకు ఎలాంటి నష్టం ఉండదు. చెట్ల ఆకులు, బెరడుతో తయారు చేసి రంగులతో తయారు చేసుకోవచ్చు.

రసాయనాలతో అనర్థాలు

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు కాలువలు, నదుల్లో నిమజ్జనం చేసినా కరగవు, వీటితో తయారైన ప్రతిమలో జిప్సం, గంధకం, మెగ్నీషియం, పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ అవశేషాలుంటాయి. వీటికి పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీరు తాగిన పశువుల ఆరోగ్యం దెబ్బతింటుంది. జలచరాలు వ్యాధులు బారిన పడి చనిపోతాయి. రసాయనాలు కలిసిన నీటి మూలంగా కేన్సర్, చర్మ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. రసాయనిక రంగులు కలిసిన నీరు పొలాల్లో చేరి ఆహార ఉత్పత్తులు కలుషితమవుతాయి.

ఏటా మట్టి ప్రతిమల పంపిణీ



వినాయక చవితి సందర్భంగా యువత ఆధ్వర్యంలో ఏటా మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. వీటి వలన మా గ్రామంలోని కొంత వరకు పర్యావరణం కలుషితం కాకుండా చేయడం మా లక్ష్యం. ఈ ఏడాది ఎక్కువగా విగ్రహాలను పంపిణీ చేయడానికి ఏర్పాటు చేస్తున్నాం

– గొలుగూరి నాగిరెడ్డి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు. పందలపాక

చిన్న విగ్రహాలు శ్రేయస్కరం



రసాయనిక రంగులతో పెద్ద విగ్రహాలు కంటే, మట్టితో చిన్న విగ్రహాలు ఏర్పాటు చేయడం వలన నష్టాలు తగ్గుతాయి. పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. చిన్న విగ్రహాలు ఏర్పాటు చేయడం వలన నిమజ్జన సమయం ప్రమాదాలను నివారించవచ్చు.

– వాసంశెట్టి రవిచంద్ర కుమార్, ఎస్సై బిక్కవోలు

‘గిడుగు’ సేవలు చిరస్మరణీయం

జిల్లా సమగ్ర శిక్ష ఏఎంఓ గౌరీ శంకరరావు



రంగంపేట హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఏఎంఓ గౌరీశంకర్



కోరుకొండ తెలుగు అక్షరాల ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

రంగంపేట: వ్యవహారిక తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన తెలుగు భాషోద్యమకర్త గిడుగు వెంకట రామమూర్తి పంతులు సేవలు చిరస్మరణీయమని జిల్లా సమగ్ర శిక్ష ఏఎంఓ డి.గౌరీశంకర రావు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రామ్మూర్తి పంతులు, ధ్యానచంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కేవీవీఎస్ వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంఓ గౌరీశంకరరావు మాట్లాడుతూ పాఠ్యాంశాల్లో ఉన్న తెలుగు భాషతో పాటు తెలుగు సాహిత్య అభిమానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయ పుస్తకాలు ఎంతో దోహదపడతాయన్నారు. తెలుగు భాషా పరిరక్షణకు సమాజంలో ప్రతిఒక్కరూ పాటు పడాలన్నారు. విద్యార్థులకు తెలుగు భాషపై వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలుగు భాషోపాధ్యాయినులు స్వాతికుమారి, శేషుకుమారి, అనితారాణి, ఆంగ్లోపాధ్యాయుడు డాక్టర్ వీసీ జాకబ్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఓంప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయురాలు శైల తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మాతృ భాషే మూలం

రాజానగరం: మానవ సమాజం అభివృద్ధి, మానవ మనుగడకు మాతృ భాషే మూలమని రాజమండ్రి ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు అన్నారు. స్థానిక గైట్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాతృ భాష ఆవశ్యకతను, అవసరాన్ని వివరించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవభావంతో ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీ మాధవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని నామవరంలో గల భారతీయ విద్యాభవన్‌లో తెలుగు భాషాభివృద్ధికి పాటుపడిన గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు, క్రీడా స్ఫూర్తినిచ్చిన ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొంతమంది విద్యార్థులు తెలుగు కవుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ విద్యాశాఖాధికారి మూర్తి, డైరెక్టర్ శేషగిరిరావు, ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధురపూడి: జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం కోరుకొండ మండలంలో ఘనంగా నిర్వహించారు. గాదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం భమిడిపల్లి రమణమూర్తి ఆధ్వర్యంలో వ్యవహారిక భాషా పితామహుడు గిడిగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాచరచన, వక్తృత్వ, తెలుగు పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, మెడల్స్ అందజేశారు. గుమ్ములూరు, గాదాల, దోసకాయలపల్లి హైస్కూళ్లలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోరుకొండ సరస్వతీ స్కూల్‌లో కరెస్పాండెంట్ పెనకటి గంగాధర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు తెలుగు అక్షరాల ఆకారంలో ఏర్పడ్డారు. గుమ్ములూరు హైస్కూల్లో పీడీ సూకరాజు, తెలుగు భాష ఉపాధ్యాయులు జగదీష్ చంద్రబోస్‌లను శాలువా, పూలమాలతో సత్కరించారు.

తేనెలొలికే తియ్యని భాష తెలుగు

బిక్కవోలు: తేనెలొలికే తియ్యని భాష తెలుగు అని మండలంలోని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. గురువారం వ్యావహారిక భాషోద్యమ మూల పురుషుడు గిడుగు వెంకటరామమూర్తి, భారత హాకీ మాంత్రికుడు ధ్యానచంద్ జయంతులను పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. అలాగే విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

సీతానగరం: మండలవ్యాప్తంగా గురువారం జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా హెచ్‌ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయుడు శీలం వీరబాబు, తెలుగు ఉపాధ్యాయిని ముత్యాల పాపారత్నంలను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, తెలుగు పాటలు, పద్యాల పోటీలు నిర్వహించారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు కన్నూరి సతీష్‌బాబు ఆధ్వర్యంలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు.

వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు

పెదపూడి: వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరమణమూర్తి అని అనపర్తి ద్వారంపూడి బుల్లెమ్మాయి జిల్లా ప్రజాపరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం కల్యాణి అన్నారు. ఈ పాఠశాల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవం , హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జన్మదినోత్సవం , జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ద్వారంపూడి నారాయణరెడ్డి అనే దాత ఏర్పాటు చేసిన క్రీడా దుస్తులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ఎన్‌ఈఎస్‌సీఓ ట్రస్ట్ ప్రతినిధి నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి అందజేశారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం



సీతానగరం డిగ్రీ కళాశాలలో క్రీడాకారులకు మెమెంటోలు అందజేసిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సీతానగరం: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అన్నారు. సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడాస్ఫూర్తి అవసరమన్నారు. స్పోర్ట్స్ నిర్వహణాధికారి, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ మాదవ్ మాట్లాడుతూ భారతదేశ హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ మూడుసార్లు ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించి భారతీయ క్రీడా ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పారని ప్రశంసించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డి.నాగేశ్వరరావు, డాక్టర్ ఎం.సుధామయి, సుబ్బారావు, ఎస్కే మదీనా, అలేఖ్య, వాణి, మీనాక్షి, రాజేశ్వరి, ఫణీంద్ర, దుర్గాప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వాక్కాయలో పోషక విలువలు మెండు



కలవచర్ల కేవీకేలో కరోండతో విలువ ఆధారిత పదార్థాల తయారీపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

రాజానగరం: కరోండ (వాక్కాయ)లో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. అధికంగా ఐరన్, విటమిన్ - సిలతో పాటు రక్త హీనతను నివారించడం, రోగ నిరోధక శక్తిని పెంపొందించడంలో వాక్కాయ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండలంలోని కలవచర్ల కేవీకేలో గురువారం వాక్కాయతో విలువ ఆధారిత పదార్థాల తయారీపై మహిళా రైతులకు శిక్షణ ఇచ్చారు. రాబోయే కాలంలో కూరగాయలు, వివిధ రకాల పండ్లు, మాంసాహార ఉత్పత్తుల తయారీతో కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకునే విధంగా మహిళా రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కేవీకే గృహ విజ్ఞాన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా కరోండా (వాక్కాయ)తో తయారు చేసిన జాము, కట్ట మీటా చట్నీ, చెర్రీ రకం తయారీ, పచ్చడి, సిరప్‌లను ప్రదర్శించారు. కేవీకే అధికారులు జీవీఆర్ సత్యవాణి, సంజయ్ వినాయక్ హెగ్డే, డాక్టర్ బి.నాగేశ్వరరెడ్డి, రఘునందన్, విజయ్‌వర్ధన్, రత్నాజీలతో పాటు వేమగిరి, కడియం, బొమ్మూరు, రాజమండ్రి రూరల్ నుంచి వచ్చిన పలువురు మహిళా రైతులు పాల్గొన్నారు.

నర్సాపురంలో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్



నర్సాపురంలో రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేస్తున్న డాక్టర్లు



చినకొండేపూడిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజు

మధురపూడి: కోరుకొండ మండలం నర్సాపురంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. నర్సాపురంలో జ్వరాలు వ్యాప్తి చెందడంతో ఇటీవల ఊరంతా జ్వరాలు అనే శీర్షికతో ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జ్వరాలపై ఇంటింటా సర్వే చేయాలని సూచించారు. ఈ మేరకు కోరుకొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నర్సాపురంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రజ్ఞ 25 మంది జ్వర పీడితులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. నొప్పులతో బాధపడుతున్న వృద్ధులకు మందులు అందించారు. గ్రామంలో ఇంటింటా సర్వే చేసి జ్వర పీడితులను గుర్తిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు సూచించారు. మండలంలోని చినకొండేపూడి అంగన్‌వాడీ సెంటర్-1లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రాజు ఆధ్వర్యంలో 42 మందికి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణంలో మార్పులు, అపరిశుభ్రత కారణంగా డెంగీ, మలేరియా, ఫైలేరియా, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. వ్యాధుల నివారణకు ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, తాజా ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్ కె.సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.నాగదుర్గ, హెల్త్ అసిస్టెంట్ బి.శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు కృష్ణవేణి, విశాలాక్షి, ఆశావర్కర్లు విజయకుమారి, ఆశలత తదితరులు పాల్గొన్నారు

నేడే మహా కుంభాభిషేకం

బిక్కవోలు: కొమరిపాలెంగ్రామంలోని కనకదుర్గమ్మతల్లి ఆలయం వద్ద మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్టు ఆలయం కమిటీ సభ్యులు, ప్రారిశ్రామిక వేత్తలు కొవ్వూరి పాపారెడ్డి, మల్లిడి పెద్దిరెడ్డి తెలిపారు. ప్రతి ఏడాది శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం ఈ మహా కుంభాషేకం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామస్తులు కాకుండా చుట్టుపక్కల గ్రామాలు నుంచి భారీగా సుమారు 25 వేల మందిపైగా భక్తులు వస్తారన్నారు. వచ్చిన భక్తులకు బలభద్రపురం కొవ్వూరి వెంకటరెడ్డి, వెంకయ్యమ్మ దంపతులు, కొవ్వూరి సతీష్ రెడ్డి,శ్రీదేవి దంపతులు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

రాజానగరం: పంటల సాగులో సేంద్రియ ఎరువులను వాడటం ద్వారా తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి కాసిమ్ అన్నారు. మండలంలోని తూర్పుగానుగూడెంలో గురువారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కలిగించారు. రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. .

వైరల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



వైరల్ ఫీవర్స్‌పై సూర్యరావుపేటలో విజిట్ చేసిన డాక్టర్ రాజీవ్ బృందం

రాజానగరం: ప్రస్తుత వాతావరణంలో విజృంభిస్తున్న వైరల్ ఫీవర్లపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫీవర్ సర్వైలెన్స్ వెరిఫికేషన్ అధికారి డాక్టర్ రాజీవ్ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని సూర్యారావుపేటలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారిని కలుసుకుని, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అదే గ్రామంలో డాక్టర్ పి.ఉదయ్‌ఏంజెల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 46 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఇద్దరికి రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంటమాలజిస్టు సుధీర్, సూపర్‌వైజర్ ఎం.రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుచరిత్ర పారాయణ యజ్ఞం



గురుచరిత్రను పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం 11 గురువారాలు నిర్వహించే గురు చరిత్ర పారాయణ యజ్ఞం గురువారం నాటికి 6వ వారానికి చేరుకుంది. అక్టోబర్ 10వ తేదీ వరకు ఈ యజ్ఞం కొనసాగుతుందని స్థానిక సాయిబాబా భక్తమండలి సభ్యులు తెలిపారు. మధ్యలో ఒకవారం సాయిసచ్చరిత్రను పారాయణ చేస్తారు. ప్రతి గురువారం తెల్లవారుజామున ఇచ్చే కాకడ హారతి అనతరం ఉదయం 6 గంటలకు పారాయణను ప్రారంభించి, మధ్యాహ్నానికి పూర్తి చేస్తారు. అసక్తి గల భక్తులు ఈ పారాయణలో పాల్గొనాలని సాయిబాబా భక్తమండలి సభ్యులు కోరారు.

పురుగుమందుల అధిక వినియోగం అనర్థం

పెదపూడి: వరిసాగులో విచక్షణ రహితంగా పురుగు మందులు వినియోగం వల్ల పంటలకు అనర్థమని ఏఓ టీవీఆర్ మణిదీప్ రైతులకు సూచించారు. పెదపూడి గ్రామంలో వరి పొలాలను ఆయన, రైతులు కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ పురుగు మందులు అధికంగా వినియోగించిన పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ తక్కువగా ఉంటుందన్నారు. వరి పైరులో కలుపును సకాలంలో నివారించుకుంటే దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. వరి నాట్లు ప్రారంభం నుంచే కలుపు నివారణ చర్యలు చేపడితే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. వ్యవసాయశాఖ అధికారులు సూచనలు సలహాలు సకాలంలో పాటించి పంటను కాపాడుకుని అధిక దిగుబడి సాధించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఏఈ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం తెలిపారు. వంగలపూడి, సింగవరం, పెదకొండేపూడి, చీపురుపల్లి, అచ్చయ్యపాలెం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

పెదపూడి: ప్రజలకు అందుబాటులో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామవరం పీహెచ్‌సీ వైద్యులు సుమతీ దేవి, మీనాక్షిదేవి అన్నారు. అనపర్తిలో వెంకటరత్నపురం సచివాలయం -3లో రామవరం పీహెచ్‌సీ పరిధిలో శిబిరం గురువారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఎక్కువగా జ్వరాలు వ్యాపిస్తున్నాయన్నారు. దానిపై ప్రజలు ఆందోళన చెందనవసరం లేదన్నారు. వెంటనే ఆస్పత్రిలో వైద్య, రక్త పరీక్షలు చేయించుకుని మెరుగైన వైద్య సేవలు పొందలన్నారు. సిబ్బంది కె.వీ.వీ.సుబ్రహ్మణ్యం, ఎస్.లక్ష్మీ, జగదీష్, అనుగ్న, రాజు, మౌనిక పాల్గొన్నారు.